


దరఖాస్తు చేసుకోండి

వికారాబాద్, సెప్టెంబరు 19: జిల్లాలో విశిష్ట సేవలందిస్తున్న వయోవృద్ధులు, సంస్థలకు అక్టోబరు 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా పురస్కారాలను అందిస్తున్నట్లు జిల్లా వయోవృద్ధుల సంక్షేమాధికారి కృష్ణవేణి తెలిపారు. అర్హులైనవారు ఈనెల 25 తేదీలోపు హైదరాబాద్ మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమ భవనంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.వివరాలకు డబ్ల్యూడీ ఎస్‌సీ.తెలంగాణ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.



మిలాద్ ఉన్ నబీ సందడి

మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని గురువారం వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ముస్లింలు ర్యాలీలు నిర్వహించారు. మేడ్చల్ పట్టణంలోని పెద్ద మసీదు నుంచి వీకర్‌సెక్షన్ కాలనీ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మణికంఠగౌడ్ ర్యాలీలో పాల్గొన్న ముస్లింలకు వాటర్‌బాటిళ్లు, బిస్కెట్లు అందజేశారు. అనంతరం మసీదులో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. - మేడ్చల్‌టౌన్, సెప్టెంబరు 19



స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ

ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛత సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం పరిగిలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య మాట్లాడుతూ, ఇళ్ల పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రతగా ఉంచుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరుచేసి చెత్తబండిలోనే వేయాలన్నారు. మురుగు కాలువల్లో ప్లాస్టిక్ బ్యాగులను వేయరాదని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద విద్యార్థులచే మానవహారం నిర్వహించారు. - పరిగి,సెప్టెంబరు 19

మున్సిపాలిటీకి, నీటిపారుదల శాఖకు

చుక్కెదురు

డిసెంబరు 3న పూర్తి నివేదికతో హాజరు కావాలని ఎన్‌జీటీ కోర్టు ఆదేశం

తాండూరు, సెప్టెంబర్ 19: తాండూరు పట్టణంలో మురుగు నీటి వ్యవస్థతో పాటు దుర్వాసన వెలువడడంపై, చిలుక వాగులో మురుగు నీరు వదులుతున్నా చర్యలు తీసుకోక పోవడంపై చెన్నై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తాండూరు మున్సిపాలిటీని, నీటి పారుదల శాఖను తీవ్రంగా హెచ్చరించింది. తాండూరు పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజ్‌గోపాల్ సార్డా రెండేళ్లుగా తాండూరులో దుర్గంధంపై పోరాటం చేస్తూనే గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. విచారణ చేపట్టిన కోర్టు డిసెంబర్ 3న జరిగే విచారణకు సమగ్ర వివరాలతో హాజరు కావాలని మున్సిపల్ తరుపు శాఖ న్యాయవాదిని ఆదేశించింది. బుధవారం మున్సిపల్ అధికారులు సమర్పించిన నివేదికపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. కాలుష్య నియంత్రణ మండలి పర్యవేక్షించక పోవడంపై కూడా కోర్టు తప్పు పట్టింది. తాండూరును సందర్శించి మురుగు నీటివ్యవస్థ , దుర్వాసనపై నివేదిక అందజేయాలని కాలుష్య నియంత్రణ మండలికి ఆదేశించింది. రూ.16 కోట్ల అంచనాలతో మురుగునీటి వ్యవస్థ మెరుగుపరచడంతో పాటు దుర్వాసన లేకుండా, వరదముంపు లేకుండా చేసేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేశామని మున్సిపల్ తరుపు న్యాయవాది కోర్టుకు నివేదించగా పూర్తి వివరాలతో తదుపరి విచారణకు రావాలని ఆదేశించింది. ప్రస్తుతం పూర్తి ప్రక్షాళన జరిగేందుకు పబ్లిక్ హెల్త్ అధికారులు రూ. 30కోట్ల అంచనా వేశారు. ప్రస్తుతానికి మంజూరైన రూ.16 కోట్లు సరిపోవని పబ్లిక్ హెల్త్ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. కాగా పట్టణ ప్రజలకు దుర్వాసన నుంచి విముక్తి కల్పించాలన్నదే తమ ఉద్దేశమని, గతంలో జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేసిన స్పందించలేదని తాండూరు పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజ్‌గోపాల్ సార్డా పేర్కొన్నారు. చివరకు జాతీయ గ్రీన్ ట్రిబనల్ కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. డిసెంబర్ 3న జరిగే తదుపరి విచారణకు పూర్తి నివేదికతో రావాలని కోర్టు అధికారులను ఆదేశించింది. ఇప్పటికైనా అధికారులు పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకోని చర్యలు చేపట్టాలన్నారు.



తాండూరులో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు (ఫైల్)




అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఆహ్వానిస్తున్న దత్తాత్రేయ

అలాయ్ బలాయ్‌కు రండి

స్పీకర్‌ను ఆహ్వానించిన హర్యానా గవర్నర్ దత్తాత్రేయ

వికారాబాద్, సెప్టెంబరు 19 : తెలంగాణ శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను గురువారం హర్యానా గవర్నర్ దత్తాత్రేయ మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రతి సంవత్సరం దసరా సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించే అలాయ్ బలాయ్ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఆహ్వానించారు. దత్తాత్రేయతో పాటు ఆయన కూతురు విజయలక్ష్మి, వియ్యంకులు బీజేపీ రాష్ట్ర నాయకులు బి. జనార్దన్‌రెడ్డితో వెళ్లి కలిశారు.

లే అవుటేనా!



లే అవుట్‌కు ప్రతిపాదించిన బురాన్‌పల్లిలోని అసైన్డ్ భూమి

అసైన్డ్ భూముల్లో లే అవుట్లు ఎప్పుడో?

- వికారాబాద్ జిల్లాలో 4 చోట్ల హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో లే అవుట్లకు ప్రణాళిక
- వికారాబాద్‌లో మూడు, పరిగిలో ఒకచోట
- రెండేళ్ల కిందట ప్రతిపాదన
- ఇంకా ప్రభుత్వ పరిశీలనలోనే నివేదిక
- కార్యరూపం దాల్చని వైనం..
- ఎదురు చూస్తున్న ఆశావహులు

వికారాబాద్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిరుపయోగంగా ఉన్న అసైన్డ్ భూములను లే అవుట్లుగా అభివృద్ధి పరచాలన్న రెండేళ్ల కిందట అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎంపిక చేసిన అసైన్డ్ భూములను హెచ్‌ఎండీఏ ద్వారా లే అవుట్లుగా అభివృద్ధి పరిచి ప్లాట్లను విక్రయించాలని ప్రతిపాదించింది. అసైన్డ్ భూముల్లో లే అవుట్లు చేసి పాట్లను విక్రయించడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూర్చుకోవచ్చని భావించింది. ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూముల్లో లే అవుట్లు చేసేందుకు అంగీకరించే రైతులకు ఎకరాకు ప్రతిఫలంగా ఆ స్థలం విలువ మేరకు 200 లేదా 400 చదరపు గజాల ప్లాట్లు ఇవ్వాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రభుత్వ పరంగా లే అవుట్లుగా అభివృద్ధి పరిచేందుకు జిల్లాలో నాలుగు చోట్ల భూసేకరణ చేపట్టాలని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించగా, మూడు చోట్ల రైతులు సానుకూలంగా ఉండగా, మరోచోట రైతుల నుంచి సానుకూల నిర్ణయం రాలేదని తెలిసింది.

జిల్లాలోని అసైన్డ్ భూముల్లో లే అవుట్ల ప్రతిపాదన ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో అసైన్డ్ భూములను లే అవుట్లుగా అభివృద్ధి పరిచి విక్రయించాలని గత ప్రభుత్వం ప్రతిపాదించింది. జిల్లాలో నాలుగు చోట్ల లే అవుట్లు చేయడంతో ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూర్చుకోవచ్చని భావించింది. మధ్య తరగతి ప్రజల కల సాకారం చేసేందుకు దోహదపడినట్లవుతుందని అధికారులూ భావించారు. అయితే ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం జిల్లాలో హెచ్‌ఎండీఏ లే అవుట్ల ఏర్పాటు ప్రతిపాదనపై ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు.

ప్రతిపాదించిన స్థలాలు

వికారాబాద్ మండలంలోని బురాన్‌పల్లిలో సర్వే నెంబర్ 55లో 50 ఎకరాల్లో లేఔట్ అభివృద్ధి పరచడానికి అధికారులు ప్రతిపాదించారు. వికారాబాద్ పట్టణానికి 4కి.మీ. దూరంలో ఉన్న బురాన్‌పల్లికి రోడ్డు సదుపాయం ఉండడమే కాకుండా ముందు భాగంలో శివసాగర్‌చెరువు ఉంది. లేఔట్ అభివృద్ధి పరచడానికి అనువైన స్థలంగా సిఫారసు చేశారు. వికారాబాద్ మునిసిపల్ పరిధిలో గోధుమగూడ వెళ్లే మార్గంలో శుభం ఫంక్షన్ హాల్ సమీపంలో 50సర్వే నెంబర్‌లో 25 ఎకరాల అసైన్డ్ భూములను గుర్తించారు. వికారాబాద్ పట్టణానికి కేవలం రెండు కిలోమీటర్ల దూరం ఉండడంతో ఈ భూములను లే అవుట్లుగా అభివృద్ధి పరచాలని ప్రతిపాదించారు. పరిగి పట్టణంలో లే అవుట్ అభివృద్ధి పరిచేందుకు సర్వే నెంబర్ 530లో 25 ఎకరాలు గుర్తించారు. ఈ భూముల్లో అసైన్డ్, పడావు భూములు ఉన్నాయి. ఈ భూములు ల్యాండ్ పూలింగ్ అభివృద్ధికి అనువైనవిగా ప్రభుత్వానికి అప్పట్లో జిల్లా అధికార యంత్రాంగం ప్రతిపాదించింది. పరిగి మెయిన్ రోడ్డుకు 500 మీటర్లు లోపలి వైపు ఉన్న ఈ భూములకు ఒకవైపు ఇళ్లు ఉండగా, మరో వైపు స్కూల్, వ్యవసాయ భూములు ఉన్నాయి. ఇదిలా ఉంటే, వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని గంగారంలో సర్వే నెంబర్లు 35 నుంచి 45 వరకు మొత్తం 11 సర్వే నెంబర్లలో భూసేకరణ చేపట్టాలని అధికారులు ప్రతిపాదించారు. అక్కడి రైతులు మాత్రం ఆ భూములను లే అవుట్లుగా అభివృద్ధి పరచడానికి సానుకూలంగా స్పందించలేదని తెలుస్తోంది.

హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో..

జిల్లాలోని ప్రధాన పట్టణాలైన వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ ప్రాంతాల్లో హెచ్‌ఎండీఏ లే అవుట్లకు డిమాండ్ ఉంది. హెచ్‌ఎండీఏ నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేసే లే అవుట్లలో ప్లాట్లు ప్రారంభంలోనే హాట్ కేకుల్లా అమ్ముడవుతుంటాయి. రియల్ ఏస్టేట్ సంస్థలు, స్థానిక వ్యాపారులు చేస్తున్న లే అవుట్లలో ప్లాట్ల ధరలు నింగినంటే విధంగా ఉంటున్న విషయం తెలిసిందే. కొన్ని ప్రాంతాల్లో మాత్రం ధరలు ఏటేటా పెరుగుతూనే ఉన్నాయి. వికారాబాద్ పట్టణం కంటే పరిగి పట్టణంలో ప్లాట్లకు డిమాండ్ ఉంది. కొత్త లే అవుట్లతో కాలనీలు ఏర్పాటవుతున్నాయి. తాండూరు, కొడంగల్ పట్టణాలు విస్తరిస్తుండడంతో వెంచర్లు ఏర్పాటవుతున్నాయి.

మధ్యతరగతి ప్రజల కల సాకారయ్యేనా



అయితే జిల్లాలో వికారాబాద్, పరిగి ప్రాంతాల్లోని అసైన్డ్ భూముల్లో ప్రభుత్వ పరంగా లే అవుట్లు చేసి.. ఓపెన్ మార్కెట్ కంటే తక్కువ ధరలకు ప్లాట్లు విక్రయిస్తే మధ్య తరగతి ప్రజల కల సాకారం చేసేందుకు దోహదపడినట్లవుతుందని భావిస్తున్నారు. హైదరాబాద్ శివార్లలో మాదిరిగా జిల్లాలో నాలుగు లే అవుట్లు చేయాలని అప్పట్లో ప్రభుత్వం నిర్ణయించింది. వికారాబాద్ జిల్లా కేంద్రంలో మూడు, పరిగి పట్టణంలో ఒక లే అవుట్ చేయాలని ప్రతిపాదించింది. పట్టణ ప్రాంతాల్లో అసైన్డ్ భూముల్లో హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో లే అవుట్లు ఏర్పాటు చేయడం ద్వారా ఆ భూములను కాలనీలుగా అభివృద్ధి పరిస్తే పట్టణం విస్తరించేందుకు దోహదపడుతుంది. కాగా, లే అవుట్ల ఏర్పాటు ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో హెచ్‌ఎండీఏ లే అవుట్ల ఏర్పాటు ప్రతిపాదనపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది తెలియాల్సి ఉంది.



పరిగి మునిసిపాలిటీ పరిధిలో ప్రతిపాదించిన ప్రభుత్వ భూమి

విత్తేదెలా?

జిల్లాలో వేరుశనగ విత్తనాల కొరత



జడ్చర్లలోని ఓ మిల్లులో వేరుశనగ విత్తనం కొనుగోలు కోసం వెళ్లిన రైతులు



- ప్రధానంగా 4 మండలాల్లో ఇబ్బందులు
- పక్క జిల్లాలకు రైతుల పరుగులు
- అయినా దొరకక అయోమయం
- సబ్సిడీ ఎత్తివేతతో ఆందోళన

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 19: వేరుశనగ విత్తనాల కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రభుత్వం విత్తనాలపై సబ్సిడీపై ఎత్తివేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని ప్రధానంగా బొంరాస్‌పేట్, దుద్యాల్, కోస్గి, గుండుమాల్, దౌల్తాబాద్ మండలాల్లో దాదాపు 10వేల ఎకరాలకుపైగా రైతులు వేరుశనగ సాగు చేస్తారు. వేరుశనగ విత్తనంపై ప్రభుత్వం సబ్సిడీని ఎత్తివేయడంతో ఒక్కసారిగా విత్తన ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ పంట ప్రధానంగా అక్టోబరు నుంచి జనవరి, ఫిబ్రవరి నెలల్లో సాగుకు అనుకూలంగా ఉంటుంది. ఇప్పటికే రైతులు చెలక ప్రాంతాల్లో పెసర, మినుము, జొన్న, పచ్చజొన్న పంటను సాగు చేశారు. నీటి లభ్యత ఉన్న రైతులు వేరుశనగ సాగుకు సిద్ధం అవుతున్నారు.

అందుబాటులో లేక...

మూడునాలుగేళ్లుగా వేరుశనగ విత్తన ధరలు పెరిగాయి. నాణ్యమైన విత్తనాలు క్వింటాల్‌కు రూ.12 వేల నుంచి రూ.14 వేల వరకు ధర పలుకుతుంది. అయితే రైతులు పంట విక్రయించే సమయంలో మద్దతు ధర లేక దిగాలు చెందుతున్నారు. చేతికొచ్చిన పంటను తక్కువ ధరకు విక్రయించి ఎక్కువ ధరకు ప్రతీ సీజన్‌లో విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేరుశనగ విత్తనాలను కంది, పప్పు దినుసుల విత్తనాల మాదిరిగా ఎక్కువ రోజులు నిల్వ చేసే వీలు లేకపోడంతో తక్కువ ధరలకు విక్రయించి నష్టపోతున్నారు. తిరిగి సీజన్ ప్రారంభం కాగానే ఎక్కువ ధరకు విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. వేరుశనిగ క్వింటాల్‌కు రూ.5 నుంచి రూ.6వేల మధ్యలో ధర పలుకుతుంది. విత్తనం కొనుగోలు చేయాలంటే క్వింటాల్‌కు రూ.12 నుంచి రూ.14 వేల వరకు పెట్టాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ప్రభుత్వాలు సబ్సిడీ ఇవ్వడంతో క్వింటాల్ వేరుశనిగ విత్తనం రూ.7నుంచి 8వేల వరకు లభించేది.

దూర ప్రాంతాలకు వెళ్లినా..


ప్రస్తుత సీజన్‌లో నాణ్యమైన విత్తనం లభించక పాలమూర్, జడ్చర్లతో పాటు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అనంతపూర్, తదితర ప్రాంతాలకు రైతులుపరుగులు తీస్తున్నారు. బొంరాస్‌పేట్ రైతులు ప్రధానంగా విత్తనం కోసం జడ్చర్ల, మహబూబ్‌నగర్‌కు వెళ్తారు. ప్రస్తుతం వేరుశనగ బుడ్డల కోసం వనపర్తి, నారాయణపేట, గద్వాల్ జిల్లాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. ఈ పంటను నిల్వ చేసుకోవడానికి వసతులు లేకపోవడంతో సాగు చేసే సమయానికి విత్తనాల ధర అమాంతం పెరుగుతోంది.

నిల్వ చేసుకునే సదుపాయం కల్పించాలి

కొడంగల్ నియోజకవర్గంలో వేరుశనగ విత్తనాన్ని నిల్వ చేసుకునేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. స్టోరేజీలను నిర్మించాలని, లేని పక్షంలో సర్కారు సబ్సిడీపై విత్తనాలు అందజేయాలని కోరుతున్నారు. వేరుశనగ పంట అమ్మబోతే అడవి, కొనబోతే కొరివిగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూనె ధరలు రోజురోజుకూ పెరుగుతున్నా, కల్లాల్లో వేరుశనగ పంట ఉన్నప్పుడు దళారుల బెడద, నిల్వ చేసే సామర్థ్యం లేకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోతున్నామన్నారు. పంటసాగు సీజన్ ప్రారంభం కాగానే విత్తనాల కోసం ఏ మార్కెట్‌కు వెళ్లినా రూ.12వేల నుంచి రూ.14వేల వరకు క్వింటాలు విత్తనాలు విక్రయిస్తున్నారన్నారు. ప్రభుత్వం పునరాలోచించాలని సబ్సిడీపై విత్తనాలను సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

పక్క రాష్ట్రానికి వెళ్లినా దొరకడం లేదు

బొంరాస్‌పేట్ మండలంలోని మెట్లకుంట, తదితర గ్రామాల రైతులు విత్తనం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపూర్ జిల్లాకు వెళ్తారు. అక్కడికి వెళ్లినా నాణ్యమైన విత్తనంతో పాటు తక్కువ ధరకు లభించడం లేదు. ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు వేరుశనగ విత్తనాలు సరఫరా చేయాలి. - మల్లేశం, రైతు, బొంరాస్‌పేట్









రాజీమార్గమే రాజమార్గం

కేశంపేట, సెప్టెంబరు 19: రాజీమార్గమే రాజమార్గమని ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. చిన్న చిన్న తగాదాలు, చీటింగ్, దొంగతనం కేసులకు సంబంధించి జాతీయ మెగా లోక్ అదాలత్‌లో రాజీ పడవచ్చని తెలిపారు. ఈ నెల 18 నుంచి 28వరకు షాద్‌నగర్ కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కక్షిదారులు రాజీ పడితే ఇద్దరూ గెలిచినట్లేనని, పెద్దల సమక్షంలో రాజీపడితే భవిష్యత్‌లో గొడవలు జరిగే అవకాశాలు ఉండవని ఆయన తెలిపారు.



















అంగన్‌వాడీ భవనానికి స్లాబ్


తాటిపర్తి అంగన్‌వాడీ భవనానికి స్లాబ్ వేసిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాచారం, సెప్టెంబరు 19 : మండల పరిధిలోని తాటిపర్తిలో ఉన్న అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరిన విషయమై ఇటీవల శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనం అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ రాజ్ శాఖ అధికారులు స్పందించారు. రూ.లక్షతో భవనానికి కొత్తగా స్లాబ్ వేయించారు. గోడలు బాగానే ఉండడంతో పెయింట్ వేస్తే సరిపోతుందని వెల్లడించారు. నెల రోజుల్లో భవనాన్ని వినియోగంలోకి తెస్తామని అధికారులు చెప్పారు. కాగా, తమ ఇబ్బందిని అధికారుల దృష్టికి తెచ్చి సమస్య పరిష్కరించినందుకు గ్రామస్తులు 'ఆంధ్రజ్యోతి'కి ధన్యవాదాలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో ఆర్థిక చేయూత


చెక్కు అందిస్తున్న సబితారెడ్డి

మహేశ్వరం, సెప్టెంబరు 19 : పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థికంగా ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. గురువారం తుక్కుగూడ మున్సిపాలిటీకి చెందిన పలువురుకి సీఎం సహాయనిధి చెక్కులను ఆమె తన కార్యాలయంలో అందజేశారు. సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బీఆర్‌ఎస్ తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షుడు జెల్లల లక్ష్మయ్య, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ నిరంజన్ రెడ్డి

ఆదిభట్ల, సెప్టెంబరు 19: మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామని ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటి పరిధిలోని కొంగరకలాన్ 8వ వార్డులో కౌన్సిలర్ గోపగళ్ల మహేందర్, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణలతో కలిసి గురువారం మున్సిపల్ జనరల్ నిధులు రూ.6లక్షల విలువైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ వార్డులో ప్రజాసమస్యలు గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో దశల వారీగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. సమస్యలు లేని, రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. నాయకులు రవిందర్ ముదిరాజ్, విష్ణుగౌడ్, భిక్షపతి గౌడ్, శ్రీకాంత్, నరహరి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అక్రమ కేసుల వల్లే కోర్టు చుట్టూ తిరుగుతున్నాం


సుధాకర్‌రెడ్డి

వికారాబాద్, సెప్టెంబరు 19: గత ప్రభుత్వం తమపై అక్రమ కేసులు బనాయించడం వల్లే కోర్టుల చుట్టూ తిరుగుతున్నామని మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన వికారాబాద్ కోర్టుకు హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. సమస్యలపై ఉద్యమిస్తే కలెక్టరేట్ ముట్టడి, ఆర్టీసీ ధర్నా తదితర కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. తమపై కేసులు ఎత్తివేయాలని తాము త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, విన్నవిస్తామని తెలిపారు.

వివాదాస్పద భూముల పరిశీలన


రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూ, ఫారెస్టు అధికారులు

మర్పల్లి, సెప్టెంబరు 19: కొన్నేళ్లుగా కల్కొడ, దామస్తపూర్‌లో కొందరు రైతుల భూములు ఫారెస్టు భూములు అని వ్యవసాయం చేయనివ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం తహసీల్దార్ మునిరుద్దీన్, ఫారెస్టు సెక్షన్ అధికారి కిషన్‌నాయక్ సర్వే నంబర్లు 199, 200లలో భూములను పరిశీలించారు. వంద మంది రైతులు 120ఎకరాల్లో సాగు చేసుకుంటున్నారు. కొన్నేళ్లుగా ఫారెస్టు అధికారులు అటవీ భూమి అని హద్దు రాళ్లు పాతి వ్యవసాయం చేయనివ్వడం లేదని రైతులు ఫిర్యాదు చేయగా అధికారులు పరిశీలించారు. త్వరలోనే సర్వే చేసి వివాదాన్ని పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

శామీర్‌పేటను మున్సిపాలిటీ చేయడం లేదు

కాంగ్రెస్ 'ఎ' బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న వేణుగోపాల్‌రెడ్డి

శామీర్‌పేట, సెప్టెంబరు 19: మండలంలో ఈ సారి కూడా పంచాయతీ ఎన్నికలే జరుగుతాయని, ప్రత్యేక మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడంలేదని తనకు ప్రభుత్వం నుంచి సమాచారం ఉందని తుర్కపల్లికి చెందిన కాంగ్రెస్ మేడ్చల్ 'ఎ' బ్లాక్ అధ్యక్షుడు జీడిపల్లి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం శామీర్‌పేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శామీర్‌పేట పురపాలక సంఘంగా మారడం లేదన్నారు. మండలంలో ఏడు పంచాయతీలుంటాయన్నారు. అన్ని పంచాయతీలతో పాటే వీటికీ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఇందుకు ఓటర్ల జాబితా కూడా సిద్ధం అవుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో రిజర్వేషన్లు అనుకూలిస్తే తాను కాంగ్రెస్ నుంచి జడ్పీటీసీగా పోటీచేస్తానని వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

రుణమాఫీ చేయాలని రైతుల ఆందోళన


ప్రజాభవన్ వద్ద రైతుల నిరసన

నవాబుపేట, సెప్టెంబరు 19: మండలంలోని నారేగూడకు చెందిన 200మంది వరకు రైతులు రుణమాఫీ కోసం ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వద్ద రైతు ధర్నాలో వారు పాల్గొన్నారు. ఆందోళన చేస్తున్న రైతులను పోలీసులు అరెస్టు చేశారు. ప్రభుత్వం కొందరికే రుణమాఫీ చేసిందన్నారు. సమస్యపై డిప్యూటీ సీఎంను కలిసేందుకు వెళ్దామంటే పోలీసులు అరెస్టు చేశారని వాపోయారు.

అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు

మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న కేఎల్లార్

మహేశ్వరం, సెప్టెంబరు 19 : తెలంగాణ ప్రభుత్వం వచ్చే నెలలో అర్హులైన ప్రతీ ఒక్కరికి కొత్త రేషన్ కార్డులను మంజూరు చేస్తుందని, తొందరిపడి ఎవరుకూడా దళారులను నమ్మి మోసపోవద్దని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌ఉమారొరెడ్డి నేతృత్వంలో కేబినెట్ సబ్‌కమిటీ ఆహార భద్రత కార్డుల జారీపై విధివిధానాలను ప్రభుత్వానికి అందించగానే అక్టోబరులో కొత్త రేషన్ కార్డుల జారీ కొరకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా, తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో కూడా దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ కసరత్తు చేస్తుందన్నారు. రేషన్ సరుకులపై ఎంత భారమైనా పేదోడికి అండగా ఉండేందుకు ప్రజాపాలన కొనసాగుతుందన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయించొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల ఎడిఏ సురేశ్‌బాబు

చేవెళ్ల, సెప్టెంబరు 19 : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి రైతులకు అధిక ధరలకు ఎరువులు అమ్మితే కేసులు నమోదు చేయిస్తామని చేవెళ్ల ఏడీఏ బి.జె.సురేశ్‌బాబు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండలంలో ఫర్టిలైజర్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారం ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా రషీదు ఇవ్వాలని సూచించారు. ఎరువులు అధిక ధరలకు అమ్మితే కేసుతో పాటు దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. సమావేశం అనంతరం వ్యాపారులందరూ నూతనంగా బదిలీపై వచ్చిన ఏడీఏ సురేశ్‌బాబును ఘనంగా సన్మానించారు. ఏవో శంకర్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యా వెలుగుకు సామాజిక గ్రంథాలయాలు దోహదం



ఆకులమైలారంలో సామాజిక గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న కార్లీ విషార్ట్

కందుకూరు, సెప్టెంబరు 19: విద్యా వెలుగుకు సామాజిక గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని, ఆమెజాన్ సంస్థ చొరవతో రంగారెడ్డి జిల్లాలోని 17 మండలాల్లో తొమ్మిది సామాజిక గ్రంథాలయాలు, 14 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 6 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించినట్లు ఆ సంస్థ వెబ్ సర్వీసెస్ డైరెక్టర్ కార్లీ విషార్ట్ తెలిపారు. గురువారం మండలంలోని ఆకులమైలారంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సామాజిక గ్రంథాలయాన్ని ఆమె ప్రారంభించారు. అమెజాన్ సంస్థ వెబ్ సర్వీస్ డైరెక్టర్ పీటర్ శంకర్, మేనేజర్ తాతాజీ, చైతన్య, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ జి.కళమ్మరాజు, మాజీ ఎంపీటీసీ అచ్చన్న పద్మపాండు, సిబ్బంది సురేష్, సుధాకర్, యాదగిరి, సెర్ప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సుంకిరెడ్డికి ఘన సన్మానం



సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ని సన్మానిస్తున్న కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 19: టాస్క్ సీవోవోగా బాధ్యతలు చేపట్టిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిని గురువారం కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. హైదారాబాద్‌లోని టాస్క్ కార్యాలయంలో కలిసి సుంకిరెడ్డిని పూలమాలలు, శాలువాలతోన సత్కరించి అభినందించారు. కల్వకుర్తి నియోజకవర్గ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనలో పెద్దపీట వేయాలని కోరినట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్‌తోనే బడుగు వర్గాల అభివృద్ధి



కాంగ్రెస్‌లో చేరుతున్న గ్రామస్తులు

షాబాద్, సెప్టెంబరు 19 : బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం చందన్‌వెళ్లిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి ఆధ్వర్యంలో గ్రామస్తులు పెద్దసంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలబడుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి.. సీఎం రేవంత్‌రెడ్డి రైతుల రుణం తీర్చుకున్నాడని అన్నారు. అనంతరం గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు చేసి, అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నర్సింహారావు, రామస్వామి, రాఘవచారి, వెంకటయ్య, రాంచందర్‌రావు, వెంకటేష్, రమేష్, కిష్టయ్య, పార్టీలో చేరినవారు నర్సింహులు, వెంకటయ్య, చంద్రయ్య, కిష్టయ్య, నర్సింహులు, నారాయణ, హనుమంతు, నర్సింగ్, శ్రీహరి, మల్లేష్, ప్రభాకర్, మహేందర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కార్మికులు, కర్షకులు కలిసికట్టుగా పోరాడాలి



పోస్టర్ విడుదల చేస్తున్న నర్సింహారెడ్డి

కొందుర్గు, సెప్టెంబరు 19: సమస్యల పరిష్కారం కోసం కార్మికులు, కర్షకులు కలిసికట్టుగా పోరాడాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 23, 24వ తేదీల్లో శంషాబాద్‌లో నిర్వహించే ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఆయన విడుదల చేశారు. నర్సింహారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు గడిచిపోతున్నా, కార్మికులు, కర్షకుల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. 8 గంటల పని విధానం అమలు కావడం లేదని, రూ.26వేల కనీస వేతనం అమలు కావడం లేదన్నారు. కౌన్సిల్ సమావేశాలకు కొందుర్గు మండలం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని కోరారు. బి.నర్సింహా, శ్రీను, చెన్నయ్య, యాదమ్మ, జంగయ్య, యామిని, అంజలి, సత్యమ్మ, షరీఫ్, యాదయ్య, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

మర్పల్లి/వికారాబాద్/మోమిన్‌పేట్ / కొడంగల్, సెప్టెంబరు 19: చదువులో వెనకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. గురువారం మర్పల్లి మండల కేంద్రంలో ఆంగ్ల భాష పట్ల నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని ఆమె తనిఖీ చేశారు. రాబోయే రోజుల్లో 1 నుంచి విద్యార్థులకు ఆంగ్ల భాషను నేర్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అనంతరం ఆమె ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రాథమికపాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చదువులో కాస్త వెనకబడి ఉన్నారని వారి పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఉపాధ్యాయులు ఏ విధంగా ఎలా బోధిస్తున్నారని, పాఠ్యపుస్తకాలపై సందేహాలు ఉంటే ఉపాధ్యాయులతో అడిగి తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

మెరిట్ లిస్టు ఆధారంగా ఖాళీల భర్తీ

వికారాబాద్ జిల్లాలోని కస్తూర్బా విద్యాలయాల్లోని స్పెషల్ ఆఫీసర్ పీజీసీఆర్టీ, సీఆర్టీటీ, పీఈటీలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలోని స్పెషల్ ఆఫీసర్ సీఆర్టీల ఖాళీల భర్తీకి ఆన్‌లైన్‌ద్వారా పరీక్ష నిర్వహించడం జరిగిందని డీఈవో రేణుకాదేవి తెలిపారు. తద్వారా మెరిట్ లిస్ట్ ఆధారంగా ఖాళీలను భర్తీ చేయడం జరుగుతుందన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. గురువారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అండర్ 14, 17 క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం, ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. కాగా, కొడంగల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఈవో రాంరెడ్డి మండల స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలు ప్రారంభించారు. క్రీడా పోటీల్లో కొడంగల్, బొంరాస్‌పేట్, దుద్యాల్, దౌల్తాబాద్ మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఎంఈవో గోపాల్, రామమస్తాన్, ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, పీఈటీలు వసంతకుమార్, శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్, కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమను పరిరక్షించండి : బక్కని



పట్టు పరిశ్రమ భవనాలను పరిశీలిస్తున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 19: పర్యావరణ సమతుల్యాన్ని పరిరక్షిస్తూ, అన్నదాతకు ఆదాయాన్నిచ్చే పట్టు పరిశ్రమను పరిరక్షించాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని లింగారెడ్డిగూడలోని పట్టుపరిశ్రమ శాఖ ఏడీ కార్యాలయాన్ని గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులచే మల్బరీని సాగుచేయించి, వారు ఆర్థికంగా అభివృద్ధి చేయాలని 1980లో లింగారెడ్డిగూడ వద్ద పట్టుపరిశ్రమ ఏడీ కార్యాలయాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. ప్రభుత్వ భూమిలో భవనాలను నిర్మించి, మల్బరీని సాగుచేస్తూ, పట్టుపురుగుల పెంపకాన్ని చేపట్టి, రైతులకు శిక్షణ ఇస్తూ వచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టుపరిశ్రమను ఉద్యానవన శాఖలో విలీనం చేసి, నిర్వీర్యం చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. విలీనం తరువాత ఏడీ కార్యాలయ నిర్వహణ అధ్వాన్నంగా మారడంతో భవనాలు శిథిలావస్థకు చేరాయని, రైతులు కూడా పట్టు పురుగుల పెంపకంపై ఆసక్తిని కోల్పోతున్నారని అన్నారు. పట్టుపరిశ్రమను పునరుద్ధరించాలని సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తానని బక్కని తెలిపారు.

ఆరోగ్య శ్రీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



లింగ్యానాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగులు

వికారాబాద్, సెప్టెంబరు 19 : రాజీవ్ ఆరోగ్య శ్రీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించి, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలరాజు అన్నారు. గురువారం ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. జీవో 60 ప్రకారం కనీస వేతనం రూ.35వేలు ఇవ్వాలని కోరారు. టీఏ, డీఏలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నర్సిములు, ప్రభాకర్, బుచ్చయ్య, శ్రీనివాస్, అరుంధతి, జయశ్రీ, శైలజ, నరసింహులు, శంకరప్ప, మహేశ్‌కుమార్, మహిపాల్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు మాధవరెడ్డి వర్ధంతి



మాధవరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు

మేడ్చల్ టౌన్ సెప్టెంబరు 19 : స్వాతంత్ర్య సమరయోధుడు సింగిరెడ్డి మాధవరెడ్డి 15వ వర్ధంతిని గురువారం ఆయన స్వగ్రామం గౌడవెల్లిలో నిర్వహించారు. ఐదు రోడ్ల చౌరస్తా వద్ద మాధవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. తెలంగాణకు, గ్రామానికి మాధవరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ ప్రీతమ్, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నాయకురాలు సునీతారెడ్డి, పార్టీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు తోటకూర వజ్రేష్‌యాదవ్, రమేష్, పరమేశ్వర్‌రెడ్డి, భూపతిరెడ్డి, సత్యం శ్రీరంగం, పీర్జాదిగూడ మేయర్ అమర్‌సింగ్, కొలను శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్, మేడ్చల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రమణారెడ్డి, రవి తదితరులు నివాళులు అర్పించారు.

షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి



బ్యాంకు వద్ద రిలే దీక్షలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 19: షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మూడు రోజులుగా బొంరాస్‌పేట్ ఎస్బీఐ వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. గురువారం దీక్షలోని ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఎలాంటి నిబంధనలు లేకుండా రైతులకు 2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. బ్యాంకులో సిబ్బంది సంఖ్యను పెంచి ప్రజల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. చివరకు బ్యాంకు మేనేజర్ హామీతో దీక్ష విరమించారు. నాయకులు చంద్రయ్య, సూర్యానాయక్, సుభాష్, బాలు, బలరాం, రైతులు వెంకటయ్య, పద్మమ్మ, బసయ్య, సాయప్ప, ఊశప్ప, పకరప్ప, భీమప్ప, బోనప్ప, బాలయ్య అనంతమ్మ పాల్గొన్నారు.

అక్రమంగా వేసిన డబ్బాల తొలగింపు



బంట్వారం(కోట్‌పల్లి), సెప్టెంబరు 19: కోట్‌పల్లిలో రోడ్డుపై నిర్మించిన డబ్బాలను ఎంపీడీఓ డానియల్ తొలగింప జేశారు. గురువారం పోలీసు ప్రొటెక్షన్ మధ్య దారూర్ సీఐ భీమ్‌కుమార్, కోట్‌పల్లి ఎస్ఐ స్రవంతి, పోలీసు సిబ్బంది సహకారంతో ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు పక్కన అక్రమంగా వేసిన డబ్బాలను తొలగించారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి



మాట్లాడుతున్న సున్నం శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, సెప్టెంబరు 19 : ఈ నెల 28న జాతీయ మెగా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. రాజీ పడదగిన కేసులకు ఇది చక్కటి అవకాశమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ సెక్రటరీ, న్యాయాధికారి డీబీ.శీతల్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీకాంత్, అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి శృతిదూత, ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, కరుణసాగర్‌రెడ్డి, కె.బాలకృష్ణరెడ్డి, సీఐ నాగరాజు, భీమ్‌కుమార్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అన్నదమ్ముల మధ్య గొడవ.. విడిపించేందుకు వెళ్లిన తల్లి మృతి



మృతి చెందిన శంకరమ్మ

పరిగి,సెప్టెంబరు 19: అన్నదమ్ముల గొడవలో విడిపించడానికి వెళ్లిన తల్లిని తోసేయడంతో కిందపడి మృతి చెందింది. వికారాబాద్ జిల్లా, పరిగి మండలం సయ్యద్‌మల్కాపూర్ గ్రామానికి చెందిన చెంచు శంకరమ్మకు ఇద్దరు కొడుకులు. పెద్దకొడుకు నజీరాబాద్‌తండా నివస్తుండగా, శంకరమ్మ, చిన్నకొడుకు శ్రీనివాస్ సయ్యద్‌మల్కాపూర్‌లో ఉంటున్నారు. శ్రీనివాస్ ఆరోగ్యం బాగా లేకపోవడంతో చూడడానికి అన్న వెంకటయ్య, వదిన లక్ష్మీ, అక్క సత్యమ్మలు బుధవారం సయ్యద్‌మల్కాపూర్‌కు వచ్చారు. రాత్రి అందరూ కలిసి మద్యం సేవించారు. అనంతరం వెంకటయ్య, డబ్బుల విషయంలో అక్క సత్యమ్మతో గొడవపడ్డారు. నన్ను చూడడానికి వచ్చిన అక్కతో ఎందుకు గొడవ పడుతున్నావని శ్రీనివాస్, అన్న వెంకటయ్యల మధ్య గొడవ ప్రారంభమైంది. ఇద్దరు అన్నదమ్ములు కొట్లాడుతుండగా తల్లి శంకరమ్మ వెళ్లి ఎందుకు కొట్లాడతారని నిలదీసింది. కోపంతో శ్రీనివాస్ తల్లిని తోసేశాడు. పక్కనే ఉన్న సీసీ రోడ్డుపై పడడంతో బలంగా తలకు గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో పరిగి అస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. మృతురాలి పెద్ద కొడుకు వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్, సీఐ శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ విజయకుమారి

శామీర్‌పేట, సెప్టెంబరు 19: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బాధ్యతగా అత్యుత్తమ నాణ్యమైన విద్యను బోధించాలని జిల్లా విద్యాధికారి(డీఈఓ) విజయకుమారి సూచించారు. గురువారం శామీర్‌పేటలోని జడ్పీ పాఠశాలలో హెచ్ఎం వేణు ఆధ్వర్యంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. డీఈవో హాజరై ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల కంటే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్ది ఉత్తమ ర్యాంకులు సాధించేలా కృషి చేయాలన్నారు. విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ పరిధి 12 పాఠశాలల 24మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెరపైకి భూ వ్యవహారం

- భూమిని పరిరక్షించుకుందామంటూ విద్యా వికాస్ సమితి కరపత్రాలు
- రూ.200కోట్ల భూమి అన్యాక్రాంతమవుతోందని ప్రచారం



విద్యా వికాస్ సమితి పేరిట పంపిణీ చేస్తున్న కరపత్రాలు

తాండూరు, సెప్టెంబరు 19 : తాండూరులోని చించోళి రోడ్డులో కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. పీపుల్స్ డిగ్రీ కళాశాలకు చెందిన ఈ భూమి ఏళ్లుగా కబ్జాదారుల చెరలో ఉంది. సబ్‌రిజిస్ట్రార్లు సైతం భూములను ప్లాట్లలో రిజిస్ట్రేషన్ చేశారు. రూ.200కోట్లకుపైగా విలువైన ఈ 27ఎకరాల 19గుంటల భూమి విషయం తాండూరులో హాట్ టాపిక్కైంది. మాజీ మంత్రి మాణిక్‌రావు వర్ధంతి రోజు ఆర్పీఎల్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి ఈ భూమిని రక్షించుకుందామని పిలుపివ్వడంతో ఈ వ్యవహారం మరోసారి తెరపైకొచ్చింది. మాజీ మంత్రి ఎం.చంద్రశేఖర్ తనయుడు ఎం.రాకేష్ కూడా దీనికి కౌంటరిచ్చారు. ఈ భూమిని గత ప్రభుత్వంలో హైదరాబాద్‌కు చెందిన వ్యాపారికి విక్రయించారు. పీపుల్స్ డిగ్రీ కళాశాల పేరిట ఉన్న ఈ భూమిని అన్యాక్రాంతం కాకుండా రక్షించాలని విద్యా వికాస్ సమితి ఆధ్వర్యంలో ప్రతినిధులు కొందరు.. 'ప్రజలరా మేల్కొందాం. భూ బకాసురుల చెర నుంచి విద్యా వికాస్ సమితి ట్రస్ట్ ఆస్తిని కాపాడుకుందాం.' అని కరపత్రాన్ని తయారు చేశారు. సమితి సభ్యులు సత్యనారాయణ బూబ్, నాగారం నర్సిములు, పటేల్ శ్రీశైలం, రాంరెడ్డి, శేరి సుభాష్‌రెడ్డిల పేరిట కరపత్రాన్ని పంపిణీ చేస్తున్నారు. ఈ అంశంపై ఉద్యమానికి సిద్ధమవుతున్నారు.

భూమి పూర్వపరాల్లోకి వెళ్తే

దివంగత మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి సూచనలతో 1966లో విద్యా సంస్థల ఏర్పాటుకు విరాళాలు సేకరించి తాండూరు పాలిటెక్నిక్ కళాశాల కమిటీని రిజిస్ట్రేషన్ చేశారు. 1973లో దానికి విద్యావికాస్ సమితిగా మార్చారు. ఇప్పటికీ ఈ స్థలంలో పీపుల్స్ డిగ్రీ కళాశాల వ్యవహారాలు కొనసాగుతున్నాయి. 1972లో పీపుల్స్ డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి మాణిక్‌రావు ఫౌండర్ చైర్మన్‌గా పనిచేశారు. అప్పట్లో గంజ్ అసోసియేషన్ వ్యాపారులు, రైతులు, టాపర్స్ సంఘం భూసేకరణకు తలాకొంత సాయం అందించారు. రూ.200కోట్ల విలువైన 27ఎకరాల 19గుంటల ఈ స్థలం దక్కన్ పార్కిలిన్ ఫ్యాక్టరీది. వివిధ కారణాలతో కోర్టు ఆధీనంలో ఉన్న ఈ స్థలాన్ని మాణిక్‌రావు అప్పట్లో కొనేందుకు హైకోర్టు ద్వారా ప్రయత్నించారు. సొసైటీగా ఏర్పడితే ఈ స్థలాన్ని ఇస్తామని హైకోర్టు చెప్పింది. విద్యా వికాస్ సమితి పేరిట ఈ స్థలాన్ని సేల్‌డీడ్ చేసుకున్నారు. భూమి కొనుగోలుకు మాణిక్‌రావుకు అప్పట్లో వ్యాపారులు కూడా సహకరించారు.

అసెంబ్లీలో చర్చ.. హౌస్ కమిటీ ఏర్పాటు

అప్పట్లో ఈ ఆస్తిని కాపాడాలని వ్యాపారులు, నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి ఏపీ అసెంబ్లీలో ఈ ఆస్తులపై చర్చ జరిగింది. 1997లో షాద్‌నగర్ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు నేతృత్వంలో సభాసంఘాన్ని వేశారు. ఈ భూమిని ప్లాట్లుగా అమ్మడాన్ని సభాసంఘం కూడా తప్పు పట్టింది. ఇప్పుడు ఈ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



మానవహారంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, విద్యార్థులు

శంకర్‌పల్లి, సెప్టెంబరు 19: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. శంకర్‌పల్లిలోని ఆదర్శ పాఠశాలలో గురువారం స్వచ్ఛతా హీ సేవా-2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ, మానవహారం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్, కౌన్సిలర్ చంద్రమౌళి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ అనంతయ్య, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

తూంకుంటను క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం



శామీర్‌పేట, సెప్టెంబరు 19: తూంకుంట మున్సిపాలిటీలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని విజయవంతగా నిర్వహించి క్లీన్ అండ్ గ్రీన్ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం అని కమిషనర్ వెంకటగోపాల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రేణుక అన్నారు. గురువారం 1వ వార్డు ఎస్‌టలైవ్ గార్డెన్‌లోని కాలనీలో, ప్రధాన చౌరస్తా వద్ద సిబ్బంది చెత్తను తొలగించారు. డ్రెయిన్లలో పూడికను తొలగించారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ కన్నేశ్వర్‌రావు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా నుంచి
బోగస్ పేర్లను తొలగించాలి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 19: స్థానికంగా నివాసం ఉండని వారి పేర్లు, డబుల్ పేర్లను, బోగస్ పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని రాజకీయ నాయకులన్నారు. ఓటరు జాబితా సవరణపై గురువారం మండల పరిషత్‌లో ఎంపీడీవో వసంతలక్ష్మి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలతో పక్ష సమావేశం నిర్వహించారు. కొందరు శాశ్వతంగా వేరేచోట్ల ఉంటున్నా గ్రామాల్లో పేర్లను ఉంచుకుంటున్నారని, ఎన్నికల్లో పోటీచేయటానికే గ్రామ ఓటరు లిస్టులో పేర్లను ఉంచుకుంటున్నారని తెలిపారు. ఊరు వదిలిన వారి పేర్లను తొలగించాలని కోరారు. 14 గ్రామాల ఓటరు లిస్టును రాజకీయ నాయకులు ఎంపీడీవోకు అప్పగించారు. ఎంపీవో సునీత, పర్యవేక్షణాధికారి ఉదయ్‌కుమార్, నాయకులు రమణా రెడ్డి, సుదర్శన్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాండూరు రూరల్: ఓటరు జాబితాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీవో విశ్వప్రసాద్ సమావేశమయ్యారు. కరన్‌కోట్ మినహా ఏ పంచాయతీ నుంచి అభ్యంతరాలు రాలేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకు లు వీరేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శరణబసప్ప, జెన్నె నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్: నూతన ఓటరు జాబితా విడుదల చేశామని ఎంపీడీవో ఉషశ్రీ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె మాట్లాడుతూ నూతన ఓటర్ల జాబితా, మార్పులు, చేర్పులు, తొలగింపుల్లో సందేహాలుంటే తమ దృష్టికి తేవాలన్నారు.

పూడూరు: ఓటరు జాబితాను పరిశీలించి సలహాలు, సూచనలు ఇవ్వాలని పూడూరు ఎంపీడీవో పాండు తెలిపారు. ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. జాబితాను పార్టీల నాయకులు పరిశీలించాలని తెలిపారు. అభ్యంతరాలుంటే ఈ నెల 21వ తేదీ కల్లా తెలియజేయాలని కోరారు.

మర్పల్లి: నూతన ఓటరు జాబితాను విడుదల చేశామని, ఏమైనా సందేహాలుంటే తెలియజేయాలని ఎంపీడీవో రాజమల్లయ్య తెలిపారు. మండల పరిషత్‌లో పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. తుది జాబితాను పంచాయతీల్లో అందుబాటులో ఉంచామని, పరిశీలించి సందేహాలుంటే తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్, మండల అధ్యక్షుడు సురేశ్, బీజేపీ, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్: ఓటరు జాబితాపై ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ నూతన ఓటరు జాబితాను పంచాయతీల్లో ఉంచామని, ఏమైనా సందేహాలుంటే తెలియజేయాలని పేర్కొన్నారు.

పెద్దేముల్: ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎంపీడీవో జర్నప్ప అన్నారు. పలు రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ల జాబితాపై సమావేశం నిర్వహించారు. వార్డుల విషయంలో కానీ, పేర్లలోగానీ అభ్యంతరాలుంటే ఈ నెల 21లోపు ఫిర్యాదు చేయాలని కోరారు. కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపాల్, బీజేపీ మండల అధ్యక్షుడు హరీ‌ష్‌గౌడ్, సందీప్‌కుమార్, శ్రీనివాస్, మోహిద్ పాల్గొన్నారు.

శామీర్‌పేట: ఓటరు జాబితాలో పొరపాట్లు ఉంటే సవరణకు ఈ నెల 21లోపు పంచాయతీలో గానీ, మండల పరిషత్‌లో గానీ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మమతాబాయి తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఓటరు జాబితాల్లో అభ్యంతరాలుంటే సరిచేసి త్వరలో తుదిజాబితాను ప్రచురిస్తామన్నారు. పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు పార్టీల నాయకులు అధికారులకు సహకరించాలని కోరారు. సమావేశంలో నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, నరేంద్రప్రసాద్, శ్రీకాంత్ రెడ్డి, మోహన్‌రెడ్డి, ఎల్లయ్య, కిష్టప్ప పాల్గొన్నారు.

దోమ: ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో మహేశ్‌బాబు ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. సమావేవంలో వివిధ పార్టీల నాయకులు అనంతయ్య, విజయ్‌కుమార్‌రెడ్డి, రాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిగి: స్థానిక సంస్థల ఎన్నికలకోసం ఓటర్ల ముసాయిదాకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారాన్ని అందించాలని పరిగి ఎంపీడీవో కరీం కోరారు. ఓటర్ల జాబితాపై మండల పరిషత్‌లో జరిగిన ఆయా రాజకీయ పార్టీల నాయకులతో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాను పంచాయతీ కార్యాలయాల్లో ఉంచామన్నారు. అభ్యంతనాల అనంతరం 28న తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు.


మేడ్చల్ టౌన్: రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో


తాండూరు రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విశ్వప్రసాద్


పరిగిలో జరిగిన రాజకీయ పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కరీం

మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు


బొక్కోనిగూడలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ పావని

ఘట్‌కేసర్, సెప్టెంబరు 19: ఘట్‌కేసర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్ అన్నారు. గురువారం 3వ వార్డు బొక్కోనిగూడలో 21 లక్షలు, 12వ వార్డులో రూ.10లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కౌన్సిలర్లతో కలిసి ఆమె ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టినట్లు గుర్తు చేశారు. మొదటి నుంచి సీసీ, బీటీ రోడ్ల నిర్మాణంతో పాటు, డ్రైనేజీల నిర్మాణం, తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వివరించారు. బొక్కోనిగూడలోని కట్టబస్తీలో గతంలోనే బీటీ రోడ్డు నిర్మాణానికి తీర్మానం చేశామన్నారు. కొంత ఆలస్యమైనప్పటికీ రోడ్డు పనులు పూర్తి అయ్యాయన్నారు. దీంతో కట్ట బస్తీ ప్రజల ఇబ్బందులు తీరాయని తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం కౌన్సిలర్ సంగీత అనేకసార్లు డిమాండ్ చేసి ఎట్టకేలకు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు బి.సంగీతప్రభాకర్‌రెడ్డి, సీహెచ్ వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, కడుపొల్ల మల్లేష్, మేకల పద్మారావు, పంచాయతీ మాజీ సభ్యులు బొక్క జంగారెడ్డి, కోరుబోతు నాగరాజు, రహీం, నాయకులు సుధాకర్‌రెడ్డి, చిత్తారి, ప్రవీణ్‌రెడ్డి, కిషన్, చందు తదితరులు పాల్గొన్నారు.

అంచలంచెలుగా హామీల అమలు



బషీరాబాద్‌లో మట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల/బషీరాబాద్, సెప్టెంబరు 19: ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఒక సేవకుడిగా పనిచేస్తానని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన యాలాలలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, గ్యాస్ సబ్సిడీ పత్రాలను ఆయన మహిళలకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభు త్వం అంచలంచెలుగా అమలు చేస్తోందన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఉచి త కరెంటు, రూ. 500కే గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. త్వరలోనే పేదలందరికీ రేషన్ కార్డులిస్తామన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి తాండూరు, కొడంగల్ ప్రాంతాలను హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల వలె తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, ప్యాక్స్ చైర్మన్ సురేందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, నాయకులు భీమప్ప, అక్బర్ బాబ, హన్మంతు, బాల్‌రెడ్డి, అనిల్‌కుమార్, తహసీల్దార్ అంజయ్య, ఎంపీడీవో పుష్పలీల, అన్నసాగర్ సత్యనారాయణరెడ్డి, అగ్గనూరు వెంకటయ్య పాల్గొన్నారు. అలాగే బషీరాబాద్‌లో సబ్సిడీ గ్యాస్ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. అర్హులైన రైతులందరికీ 2లక్షల రుణమాఫీని ఈ నెలాఖరులోగా చేసితీరుతామన్నారు. పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా తాము ఉత్తిత్తి జీవోలు తేబోం అని, చెప్పించి చేసి చూపుతాం అన్నారు. నీళ్లపల్లి-మైల్వార్ ఫారెస్ట్ కబ్జాల పర్వాన్ని దశాబ్దాల తర్వాత ప్రభుత్వం సర్వే చేయించి కొలిక్కి తెస్తున్నామని, 1,200 ఎకరాల మన భూమిని కర్ణాటక రైతులు ఆక్రమించినట్టు తేలిందన్నారు. త్వరలోనే భూమిని స్వాధీనం చేసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. జీవన్గి, ఇందర్‌చెడ్, నవాంద్గీ ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరిస్తామన్నారు. బషీరాబాద్ పీహెచ్‌సీని సీహెచ్‌సీగా 30 పడకల స్థాయికి పెంచామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, నవాంద్గీ ప్యాక్స్ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, వైస్ చైర్మన్లు అజయ్‌ప్రసాద్, చందర్‌నాయక్, నాయకులు వెంకటేష్, శ్రీనివాస్‌రెడ్డి, కలాల్ నర్సింహులుగౌడ్, లక్ష్మణ్‌రావు, కె.మాణిక్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బి.శంకరప్ప, నర్సిరెడ్డి, రామునాయక్, తహసీల్దార్ వై.వెంకటేష్, ఎంపీడీవో విజయ్‌కుమార్, సూపరింటెండెంట్ విజయకుమారి, సీనియర్ అసిస్టెంట్ శేర్‌ఖాన్, ఏపీఎం పద్మారావు పాల్గొన్నారు.

రోడ్డు కోసం ఎమ్మెల్యేకు వినతి

బీటీ రోడ్డు పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా కాంట్రాక్టర్ పనులను పూర్తి చేయడం లేదని బాబునాయక్‌తండా మాజీ సర్పంచ్ సూర్య ఎమ్మెల్యేకు విన్నవించారు. తాము పడుతున్న ఇబ్బందులపై ఆయన ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. ఇందుకు ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ.. సంబంధిత కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మట్లాడారు.వెంటనే పనులు ప్రారంభించి రోడ్డు పూర్తికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మరికొందరు తమ సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిపై అధికారులతో మట్లాడి అక్కడికక్కడే పరిష్కారానికి తగిన చర్యలు తీసుకున్నారు.

తాండూరులో బీజేపీ సభ్యత్వ నమోదుకు శ్రీకారం


మాజీ చైర్మన్ నర్సిములుకు బీజేపీ సభ్యత్వం ఇస్తున్న నాయకులు

తాండూరు/తాండూరు రూరల్/మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 19: తాండూరులో బీజేపీ నాయకులు గురువారం పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. యశోద నగర్ వార్డు 28, బూత్ నంబర్ 151లో బూత్‌లో మున్సిపల్ మాజీ చైర్మన్ నాగారం నర్సిములుకు సభ్యత్వ కార్డును అందజేశాని బూత్ అధ్యక్షుడు సంగమేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణముదిరాజ్, కార్యదర్శి భద్రేశ్వర్, పట్టణ శాఖ అధ్యక్షుడు నాగారం మల్లేశం, ఉపాధ్యక్షులు దొమ కృష్ణ పాల్గొన్నారు. అలాగే తాండూరు మండలం కోటబాస్పల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదును నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు ప్రభుశంకర్ అధ్యక్షతన నాయకులు ఇంటింటికి వెళ్లి సభ్యత్వ నమోదు చేశారు. 11కోట్ల సభ్యత్వాలతో ప్రపంచంలో ఉన్న ఏకైక పార్టీ బీజేపీ అని అన్నారు. రూపాయి అవినీతి లేకుండా నీతివంత పాలన అందిస్తున్న గొప్పనేత ప్రధాని మోదీ అన్నారు. కార్యక్రమంలో మండల సభ్యత్వ ప్రముఖ మల్లికార్జున్‌స్వామి, బూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, యువ కులు పాల్గొన్నారు. జిల్లాలో అత్యధికంగా పార్టీ సభ్యత్వాలను నమోదు చేయాలని బీజేపీ మేడ్చల్-మల్కాజ్‌గిరి రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి అన్నారు. మేడ్చల్‌లో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదులో ఆయన పలువురితో సభ్యత్వం చేయించారు. అన్ని వార్డాల ప్రజలను పార్టీలో సభ్యత్వం కల్పించాలన్నారు. యువకులు, మహిళలకు ప్రాధాన్యత నిస్తూ సభ్యత్వం చేయించాలన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ పట్టణ బీజేపీ అధ్యక్షుడు కొండం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


మేడ్చల్‌లో సభ్యత్వం ఇస్తున్న విక్రమ్‌రెడ్డి

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు


జినుగుర్తిలో మిలాద్ ఉన్ నబీ వేడుక

దౌల్తాబాద్/పరిగి/ఘట్‌కేసర్ రూరల్/తాండూరు రూరల్, సెప్టెంబరు 19: దౌల్తాబాద్ మండలంలోని గోకఫస్లాబాద్‌లో గురువారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ర్యాలీ నిర్వహించారు. మత పెద్దలు మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని మిలాద్ ఉన్ నబీ వేడుకలు జరుపుకుంటామని, ప్రవక్త చూపిన మార్గంలో ముస్లింలు పయనించాలని సూచించారు. బీజేపీ మండల అధ్యక్షుడు సతీశ్ ముదిరాజ్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కేశవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు భీమ్‌రెడ్డి, దాసప్ప, మొగులప్ప, శ్రీకాంత్‌రెడ్డి, కొండ గోపాల్, జాకీర్ అలీ, షకీల్, మొహ్మద్ మన్సూర్, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు. పరిగిలో ఈద్ మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని జరుపుకున్నారు. మజీద్ నుంచి ప్రారంభమైన ర్యాలీ దర్గా వరకు వెళ్లారు. కౌన్సిలర్ మునీరు, నాయకులు ఖాజీ అజర్, జహీర్, ఆసిఫ్, సమద్, ఇంతియాజ్, సల్తాన్ పాల్గొన్నారు.ప్రతాప్‌సింగారంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డబుల్‌బెడ్ రూం ఇళ్ల వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి సతీమణి చంద్రకళను శాలువాలతో సత్కరించారు. మాజీ ఉపసర్పంచ్ అబేదాబేగం, జాహంగీర్‌పాషా, జాహంగీర్, నాయకులు బద్దం కుమార్ తదితరులు పాల్గొన్నారు. తాండూరు మండలం జినుగుర్తిలో మిలాద్ ఉన్ నబీ ని జరుపుకున్నారు. ముస్లింలు శాంతి ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తంచంద్ పాల్గొని మాట్లాడారు. కుల మతాలకు అతీతంగా ప్రజలు కలిసి ఉంటారన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజ్మత్, హసీం అలీ, రఘుకిషోర్, శ్రీనివాస్, శామప్ప పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా పీఆర్టీయూటీఎస్ కొడంగల్ మండల శాఖ ఎన్నిక

కొడంగల్ రూరల్, సెప్టెంబరు. 19: కొంగల్ మండల పరిషత్ సమావేశంలో గురువారం కొంగల్ పీఆర్టీయూటీఎస్ మండల సమావేశం మహమ్మద్ సులేమాన్ అధ్యక్షతన జరిగింది. ప్రధాన కార్యదర్శి మహేందర్‌సింగ్ నివేదికను సమర్పించారు. జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ హాజరయ్యారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూటీఎస్ అగ్రస్థానంలో ఉందన్నారు. ఈ సందర్భంగా పీఆర్టీయూటీఎస్ మండల అధ్యక్షుడిగా అబ్దుల్ హక్, ప్రధాన కార్యదర్శి దినేష్‌సింగ్, అసోసియేట్ అధ్యక్షులు ఎం. వెంకటేశం, మహిళా ఉపాధ్యక్షులు రజితరెడ్డి, కార్యదర్శి బస్వంత్, మహిళా కార్యదర్శి మహేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు కార్యక్రమంలో ఎంఈఓ రాంరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు యాదగిరి, గోపీనాథ్, వెంకటయ్య, ఏసురత్నం, చెన్నకేశవయ్య, జిల్లా అసోసియేట్ సభ్యులు శరణ్‌కుమార్ ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

ఓటింగ్ ద్వారా కార్యవర్గం ఎన్నిక

పెద్దేముల్: పీఆర్టీయూ ఉపాధ్యాయ మండల శాఖ ఎన్నికలో పోటీనెలకొని ఓటింగ్ ద్వారా అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక జరిగింది. ఎన్నికల్లో అధ్యక్షుడిగా నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా వెంకట్‌రెడ్డి ఎన్నికయ్యారు.

బాధితురాలికి అండగా బీజేపీ నాయకుడు


మహేశ్వరిని పరామర్శిస్తున్న నాయకుడు వడ్ల నందు

బంట్వారం, సెప్టెంబర్ 19: సల్బత్తాపూర్ గ్రామానికి చెందిన జి.మహేశ్వరి రెండు కిడ్నీల సమస్యతో సహాయం కోసం వేచి చూస్తోంది. వికారాబాద్ నియోజకవర్గ బీజేపీ కోఆర్డినేటర్ వడ్ల నందు గురువారం హైదరాబాద్‌లోని బీరంగూడలోని శ్రీవేద హాస్పిటల్‌లో సంప్రదించి 10లక్షల వరకు అయ్యే వైద్య ఖర్చులను 6.5లక్షలకు తగ్గించారు. నందు తన వంతుగా రూ.లక్ష ఇచ్చి టెస్టులు చేయిస్తానని హామీ ఇచ్చారు.

నేడు గ్యాస్ సబ్సిడీ మంజూరు పత్రాల పంపిణీ

మోమిన్‌పేట్, సెప్టెంబరు 19: మోమిన్‌పేట్ మండల కేంద్రంలో శుక్రవారం తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చేతుల మీదుగా గ్యాస్ సబ్సిడీ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని ఎంపీడీవో విజయలక్ష్మి గురువారం తెలిపారు. నేటి ఉదయం11:30 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాలను పంపిణీ చేస్తారని తెలిపారు. లబ్ధిదారులు రేషన్, ఆధార్‌కార్డు, పాస్ ఫోటో సైజ్ ఫోటోలు తీసుకురావాలని తెలిపారు.

బడీడు పిల్లలంతా స్కూల్లో ఉండాలి


తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం గౌరీశంకర్

మోమిన్‌పేట్, సెప్టెంబరు 19: బడీడు పిల్లలంతా బడుల్లోనే ఉండాలని మేకవనంపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకర్ అన్నారు. గురువారం మండలంలోని మేకవనంపల్లి పాఠశాల పరిధి ఎల్లమ్మగడ్డ తండా, రాళ్లగూడుపల్లి, లచ్చానాయక్, గుట్టమీది తండాల్లో ఉపాధ్యాయులతో కలిసి పర్యటించారు. ఇంటి దగ్గర ఉన్న చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడారు. రోజూ పాఠశాలకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాలల ఎచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

కులకచర్ల, సెప్టెంబరు 19: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని మండలంలోని ముజాహిద్‌పూర్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి హెప్సిబా తెలిపారు. కులకచర్లలో గురువారం జరిగిన జోనల్‌స్థాయి వాలీబాల్ క్రీడల్లో విద్యార్థులు రాణించి బహుమతులు సాధించారు. వాలీబాల్ అండర్-14 బాలుర, బాలికల విభాగాల్లో మొదటి స్థానం, అండర్-17 బాలుర విభాగంలో రెండో స్థానం సాధించారు. ఈ క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో పీడీ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ముజాహిద్‌పూర్‌లో క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ప్రజా భవన్‌కు తరలకుండా నాయకుల ముందస్తు అరెస్ట్

శామీర్‌పేట/కులకచర్ల, సెప్టెంబరు 19: ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు రైతులకు రుణమాఫీ చేయడం లేదని బీఆర్ఎస్ అధిష్ఠానం గురువారం రుణమాఫీ కాని రైతులతో చలో ప్రజాభవన్ తలపెట్టింది. ఈ కార్యక్రమానికి శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల బీఆర్ఎస్ నాయకులు వెళ్లకుండా శామీర్‌పేట పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నాయకులు మధుకర్‌రెడ్డి, తాళ్ల జగదీశ్‌గౌడ్, సతీష్‌రెడ్డి, నర్సింలు, తదితర నాయకులను ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌లను అరెస్ట్ చేశారు. ప్ర జాభవన్‌కు వెళ్లకుండా కులకచర్ల బీఆర్ఎస్ నా యకులను అరెస్టు చేశారు. వారు మాట్లాడుతూ రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసిన కాం గ్రెస్ పార్టీకి రాబోయే రోజుల్లో రైతులు తగిన గుణపాఠం చెప్పడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాగని బిచ్చన్న, శివాని సురేశ్, మేకుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'యాలాల తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలి'

యాలాల, సెప్టెంబరు 19: యాలాల తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలని కేవీపీఎస్ జిల్లా నాయకుడు ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశారు. గురువారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో నాయకులు, రైతులు యాలాలలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్కయ్య మాట్లాడుతూ యాలాల తహసీల్దార్ సమయ పాలన పాటించకుండా వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన రైతులను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రజలతో దురుసుగా మాట్లాడుతూ వెళ్లిపోండి అంటున్నాడని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల కొమ్ముకాస్తూ రైతులను పట్టించుకోవడం లేదని అన్నారు. విరాసత్, మ్యుటేషన్ల అర్జీలను పట్టించుకోకుండా రియల్టర్లకే రిజిస్ట్రేషన్ చేస్తున్నారన్నారు.

క్రైం కార్నర్

వినాయకుడి స్టీలు కోసం వెళ్లి
చెరువులో మునిగి వ్యక్తి మృతి


మృతిచెందిన పెద్దగొల్ల అనంతయ్య

వికారాబాద్, సెప్టెంబరు 19: వినాయక విగ్రహాలకు వాడిన స్టీలు కోసం చెరువులోకి దిగిన వ్యక్తి నీట మునిగి మృతి చెందిన సంఘటన వికారాబాద్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మోమిన్‌పేట మండలం దుర్గంచెరువుకు చెందిన పెద్దగొల్ల అనంతయ్య(42) సంవత్సర కాలంగా వికారాబాద్‌లోని కొత్తగడిలో ఉంటున్నాడు. అతడికి భార్యాపిల్లలు ఉన్నారు. అనంతయ్య కూలి పనులు చేసేవాడు. మంగళవారం కొన్ని వినాయకులు కొంపల్లి చెరువులో నిమజ్జనం కావడంతో చెరువులో వినాయకుడికి ఉపయోగించే స్టీలు కోసం వెళ్లిన అనంతయ్య చెరువులో పడి ఊపిరాడక మృతి చెందాడు. గురువారం గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం కోసం వికారాబాద్ ఆసుపత్రి తరలించారు.

కుంటలో మునిగి వ్యక్తి ...


మృతిచెందిన అంజిలప్ప

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 19: నీటి కుంటలో మునిగి వ్యక్తి మృతిచెందిన సంఘటన సత్తర్‌కుంట తండాలో జరిగింది. చిలుముల్ మైలారానికి చెందిన అంజిలప్ప(45) బుధవారం తండా శివారులోని పులిచర్ల కుంటలో ఉన్న బోరు మోటార్‌కు మరమ్మతులు చేసేందుకు దిగాడు. ఈ క్రమంలో అంజిలప్ప నీటిలో గల్లంతయ్యాడని కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గురువారం ఈతగాళ్లతో మృతదేహాన్ని వెలికితీశారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్సై అబ్దుల్‌రవూఫ్ తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 19: చెరువులో గల్లంతైన యువకుడి మృతదేహాన్ని రెస్క్యూటీం వెలికి తీసింది. మేడ్చల్ మండలం అరికెలగూడ కోమటి కుంటలో ఈతకు వెళ్లిన విల్సన్(35), దీపు(29) యువకులు నీటిలో మునిగి గల్లంతైన విషయం తెలిసిందే. విల్సన్ మృతదేహం బుధవారం లభించగా, దీపు మృతదేహాన్ని గురువారం అగ్నిమాక దళం వెలికి తీసింది. అనంతరం పోస్టుమార్టం కోసం గాంధీమార్చురీకి తరలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 19: గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన శివకుమార్(27), రఘువర్మ(26) కొండాపూర్‌లో అద్దెకుంటున్నారు. గురువారం ఉదయం ఎదులాబాద్ రోడ్డు అండర్‌పాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వారి బైక్ ట్యాంక్ కవర్‌లో 90 గ్రాముల గంజాయి లభించింది. వారిని విచారించగా పోచారం రాజీవ్‌గృహకల్పలో ఉండే అహ్మద్ నుంచి కొన్నట్టు చెప్పారు. దీంతో శివకుమార్, రఘువర్మ, అహ్మద్‌లపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

రోగులకు ఇబ్బందులు కలిగించొద్దు


మందులను పరిశీలిస్తున్న వైద్యాధికారి రవీంద్రయాదవ్

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 19: ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు కలిగించకుండా వైద్యసేవలందించాలని జిల్లా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రవీంద్రయాదవ్ సూచించారు. గురువారం బొంరాస్‌పేట్ ప్రభుత్వాసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. వైద్యుడు హేమంత్‌తో మాట్లాడుతూ రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రతీ రోగితో ప్రేమతో మాట్లాడి వైద్య సేవలందించాలన్నారు. ఎప్పటికప్పుడు మందుల వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఉన్నారు.

వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

కొడంగల్, సెప్టెంబరు 19: సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ తెలిపారు. గురువారం స్వచ్ఛతా హీ సేవలో భాగంగా కొడంగల్ పట్టణంలోని కృష్ణవేణి పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది భరత్‌కుమార్, పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


ఓరియేంటేషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లేష్

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 19 : విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని అనురాగ్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సి. మల్లేష్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ఓరియేంటేషన్ ప్రోగ్రాంకు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని, సామాజిక సేవలకు ముందుకు రావాలని కోరారు. 160మంది విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఓరియేంటేషన్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఫార్మసీ విభాగ డీన్ వసుదభక్తి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు నవీన్, తిరుపతి, సుష్మిత, ప్రియాంక, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలను పూడ్చాలి : చైర్‌పర్సన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, సెప్టెంబరు 19: తాండూరులో రోడ్డు, కల్వర్టులపై ప్రమాదకరంగా గుంతలను వెంటనే పూడ్చాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న అధికారులకు సూచించారు. 'జర భద్రం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో రోడ్ల పరిస్థితిపై ప్రచురితమైన వార్తపై ఆమె స్పందించారు. రోడ్లపై పడిన గుంతలను గురువారం ఆమె పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే వైష్ణవి హోండా షోరూమ్ పక్కన కల్వర్టుపై మరమ్మతులు చేపట్టారు. మిగిలిన గుంతలన్నింటినీ తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాల అందజేత

దౌల్తాబాద్, సెప్టెంబరు 19: ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యాస్ సబ్సిడీ పథకంలో భాగంగా ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న మహిళలకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. గురువారం దౌల్తాబాద్ మండలం దేవరఫస్లాబాద్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కూర రాజు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.